# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- పర్యావరణ పరిరక్షణ ప్రచారంలో దేశంలోని వేలాది పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- వస్త్రపరిశ్రమ రంగంలో ఆవిష్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం 1500 కోట్ల రూపాయలను అందించిందని కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు.

- ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశం అధిక వృద్ధిని, తక్కువ ద్రవ్యోల్బణాన్ని చూసిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.

- ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు న్యూ ఢిల్లీలో 3 కిలోమీటర్ల మారథాన్‌ను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు జెండా ఊపి ప్రారంభించారు.

==============================

పర్యావరణ పరిరక్షణ ప్రచారంలో దేశంలోని వేలాది పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంతో పాల్గొంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ ప్రజలతో తన మనసులోన భావాలను పంచుకునే “మన్ కీ బాత్” కార్యక్రమం 114వ సంచిక ఈ రోజు ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో పలు ఆసక్తికరమైన అంశాలను ప్రధానమంత్రి స్పృశించారు. “మన్ కీ బాత్” కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నందున తాను భావోద్వేగానికి గురైనట్లు తెలిపారు. “స్వచ్ఛ భారత్ మిషన్”ను ప్రజా ఉద్యమంగా మార్చిన వారిని నరేంద్ర మోదీ అభినందించారు. వివిద రంగాలలో స్ఫూర్తిగా నిలుస్తున్న పలువురు వ్యక్తుల గూర్చి ప్రస్తావించారు. “ఏక్ పేడ్ మాకే నామ్” – “అమ్మ పేరుతో ఒక మొక్క” కార్యక్రమం గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఈ నినాదాన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళ్తున్న వ్యక్తుల కోసం ప్రధానమంత్రి పేర్కొంటూ ...

(వాయిస్ 40 సెకన్లు)

==============================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమ విదానంలో మహారాష్ట్రలో 11 వేల 200 కోట్ల రూపాయలకు పైగా విలువైన వివిధ ప్రాజెక్టులకు ఈ రోజు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసి, జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ.. వివిధ పథకాలను ప్రస్తావిస్తూ, గొప్ప వ్యక్తులకు స్ఫూర్తినిచ్చే మహారాష్ట్ర అభివృద్ధిలో కొత్త అధ్యాయానికి సాక్ష్యమిస్తోందని పేర్కొన్నారు. షోలాపూర్ విమానాశ్రయం ప్రారంభోత్సవం విఠల్ స్వామి భక్తులకు ప్రత్యేక కానుకగా ఆయన అభివర్ణించారు. ఈ విమానాశ్రయం వ్యాపార, పారిశ్రామిక, పర్యాటక రంగానికి ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. మహారాష్ట్ర మహిళా సాధికారత వారసత్వానికి, ప్రత్యేకించి మహిళా విద్య కోసం ఉద్యమించిన సావిత్రిబాయి ఫూలే కృషికి ఆయన నివాళులర్పించారు. శంకుస్థాపన చేయబడ్డ సావిత్రీబాయి ఫూలే మెమోరియల్ సంఘ సంస్కరణ ఉద్యమానికి శాశ్వత నివాళిగా నిలుస్తుందని, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమైకా ప్రధానమంత్రి డాక్టర్ ఆండ్రూ హోల్నెస్ రేపటి నుండి అక్టోబరు 3వ తేదీ వరకు భారతదేశంలో అధికారిక పర్యటన చేయనున్నారు. భారతదేశానికి ఇది అతని మొదటి పర్యటన. ఈ పర్యటనలో హోల్నెస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ప్రతినిధి స్థాయి చర్చలు జరుపుతారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని కలుసుకుంటారు. ఈ పర్యటనలో ద్వైపాక్షిక సహకారానికి పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. ఈ పర్యటన జమైకా, భారత్ ల మధ్య దీర్ఘకాలిక బంధాలను పటిష్టం చేస్తుందని భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వస్త్రపరిశ్రమ రంగంలో ఆవిష్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం 1500 కోట్ల రూపాయలను అందించిందని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. ఈ రోజు బీహార్ లోని పాట్నా NIFT క్యాంపస్‌లోని విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవిష్కరణల కోసం 157 స్టార్టప్‌లను ఇప్పటికే ఆ దిశగా నిమగ్నం చేశామని చెప్పారు. టెక్స్‌టైల్స్ రంగాన్ని ప్రస్తుతం ఉన్న 167 బిలియన్ డాలర్ల నుంచి 350 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని మంత్రిత్వ శాఖ యోచిస్తోందని కేంద్రమంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశం అధిక వృద్ధిని, తక్కువ ద్రవ్యోల్బణాన్ని చూసిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో సంకల్ప్ ట్రస్ట్ ఫౌండేషన్ నిర్వహించిన లెక్చర్ సిరీస్ 10వ ఎడిషన్ సెషన్‌లో కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. భారత ప్రజా డిజిటల్ మౌలిక సదుపాయాలను ప్రశంసిస్తూ, ప్రపంచంలోనే భారతదేశం అత్యంత అధునాతన చెల్లింపు వ్యవస్థను కలిగి ఉందని అన్నారు. మౌలిక సదుపాయాలలో పెట్టుబడి, సమ్మిళిత అభివృద్ధి, తయారీ, చట్టాల సరళీకరణ అనే నాలుగు స్తంభాలపై ఆర్థికవృద్ధి జరుగుతోందని అశ్విని వైష్ణవ్ అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూ ఢిల్లీలోని ఇండియా గేట్ నుండి భారత్ మండపం వరకు 3 కిలోమీటర్ల మారథాన్‌ను కేంద్ర మైనారిటీ వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలు గుండె ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో 150 మంది హృద్రోగులు, 100 మంది వైద్యులతో సహా 800 మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. అందరూ గుండె ఆరోగ్యం, గుండె-ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవాల్సిన ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ఈ మారథాన్‌ను నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా వాణిజ్య కార్యదర్శి గినా రైమోండో ఆహ్వానం మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నాలుగు రోజుల అమెరికా పర్యటనకు రేపు బయలుదేరనున్నారు. వ్యాపార, పెట్టుబడి వాతావరణాన్ని మెరుగుపరచడం, భారతీయ, అమెరికన్ వ్యాపార సంఘాల మధ్య సంబంధాలను మరింతగా పెంచుకోవడం లక్ష్యంగా ఈ పర్యటన సాగనున్నది. అక్టోబర్ 2వ తేదీన ఇండియా-యుఎస్ఎ సిఇఒ ఫోరమ్‌కు, అక్టోబర్ 3వ తేదీన వాషింగ్టన్ డిసిలో జరిగే 6వ ఇండియా-యుఎస్ఎ కమర్షియల్ డైలాగ్ కార్యక్రమాలకు కేంద్రమంత్రి సహ అధ్యక్షత వహిస్తారు. యంగ్ బిజినెస్ లీడర్స్ రౌండ్ టేబుల్, ఇండియా-యుఎస్ఎ జెమ్స్ అండ్ జ్యువెలరీ ట్రేడ్ రౌండ్ టేబుల్ సమావేశాలకు కూడా పీయూష్ గోయల్ అధ్యక్షత వహిస్తారు. స్థిరమైన ఆర్థిక వృద్ధిని సృష్టించే మార్గాలపై ఇరుపక్షాలు చర్చిస్తారని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. భారతదేశంలో పెట్టుబడులకు ఉన్న విస్తృత అవకాశాలను ప్రముఖంగా ప్రస్తావించడానికి ప్రముఖ అమెరికన్, భారతీయ CEOలు, పరిశ్రమ నాయకులతో కేంద్రమంత్రి సంభాషిస్తారని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడు, కర్ణాటక, లక్షద్వీప్, కేరళలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) అంచనా వేసింది. గోవా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్‌లలో రాబోయే రెండు రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని IMD పేర్కొంది. అలాగే రానున్న రెండు రోజుల పాటు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

IPS అధికారి నలిన్ ప్రభాత్‌ను జమ్మూ & కాశ్మీర్ పోలీస్ స్పెషల్ డైరెక్టర్ జనరల్ గా కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నియమించింది. ప్రభాత్ అక్టోబర్ 1 నుండి జమ్మూ & కాశ్మీర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (DGP) గా కూడా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత డిజిపి ఆర్.ఆర్. స్వైన్ రేపు పదవీ విరమణ పొందిన తర్వాత ప్రభాత్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్ ఎన్నికల విభాగం 'గ్రీన్ స్వీప్' కార్యక్రమం కింద 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2024 జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 1 లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని సాధించింది. ఉధంపూర్, పూంచ్ జిల్లాల పోలింగ్ స్టేషన్ల పరిధిలో నిర్దేశించిన లక్ష్యంలో దాదాపు 99 శాతం మొక్కలను నాటారు. కేంద్రపాలిత ప్రాంతంలోని 20 జిల్లాల్లో 10 జిల్లాలు తమ తమ పోలింగ్ స్టేషన్‌లలో ప్లాంటేషన్ డ్రైవ్‌లలో 90 శాతం అంతకంటే ఎక్కువ లక్ష్యాన్ని సాధించాయని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ PK పోల్ తెలిపారు. పర్యావరణ వ్యవస్థను కాపాడేందుకు చెట్ల పెంచాల్సిన ఆవశ్యకత చాలా ఉందన్నారు. ఈ డ్రైవ్ భారీ విజయాన్ని సాధించిందని, పర్యావరణం, మొక్కలపై విద్యార్థులలో గణనీయమైన జ్ఞానాన్ని పెంచి శక్తివంతం చేసిందని CEO PK పోల్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు జరిగిన "మన్ కీ బాత్" ప్రసంగంలో ప్రసార భారతి, ఆకాశవాణి, దూరదర్శన్‌లను ప్రశంసించినందుకు ప్రధాని నరేంద్ర మోడీకి ప్రసార భారతి ఛైర్మన్ నవనీత్ సెహగల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంస్థలకు, అందులో సేవలందిస్తున్న ఉద్యోగులకు ప్రధానమంత్రి ప్రశంసలు ఎంతో ప్రేరణ అందిస్తాయని ఆయన సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. దేశ నిర్మాణ సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నరేంద్ర మోదీతో కలిసి ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. ఈ ప్రసంశలు మొత్తం ప్రసార భారతి కుటుంబంలో కొత్త శక్తిని, చైతన్యాన్ని నింపుతుందని ప్రసార భారతి ఛైర్మన్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =